
# ఇది కథ కాదు

రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాద్ వచ్చి నాలుగు నెలలు కావస్తోంది. మా ఆఫీస్ అయిదంతస్థుల భవనం. నాలుగు నెలలైనా ఇంకా కొత్తగానే ఉంది. ఈమధ్యనే ఆంజనేయులు గారితో నాకు బాగా సన్నిహితం ఏర్పడింది. ఆంజనేయులుగారు అసిస్టెంట్ ఎక్కౌంట్స్ ఆఫీసర్. నేను యు.డి.సి.గా ఆయన దగ్గరే పనిచేస్తున్నాను. లంచ్‌లో నేను, ఆయనా కలిసి లకిడీకాపూల్ దాకా వెళ్ళి ద్వారకాలో టిఫిన్ చేసివస్తు



బాబూరావు మొవ్వ

న్నాం ఈమధ్యనుంచే.

అంజనేయులు గారి వయస్సు దాదాపు యాభైఏళ్లు ఉంటుంది. కానీ అలా కనపడరు. ఎప్పుడూ అందర్నీ విష్ చేస్తూ, కలుపుగోలుగా మాట్లాడుతూ ఉంటారు.

లంచ్‌టైమ్ కాకముందే ఆయన బయటి కెళ్లారని తెలిసి, ఎవరితోనూ కలవలేక ఆ రోజు లంచ్‌కి నేను ఒంటరిగానే ఆఫీసు నుంచి బయటపడ్డాను.

అనుకోకుండా రోడ్డుమీద ఆంజనేయులుగారు కనిపించారు. "ఇవాళ మీరు లేరని నేఒక్కడ్నే బయల్దేరాను" నవ్వుతూ అన్నాను.

"ఆ... ఏం లేదోయ్. ఈ బూట్లని బాగుచేయిద్దామని రోజూ అనుకుంటున్నాను. నువ్వేదో సీరియస్‌గా రాసుకుంటున్నావు. సరే - డిస్టర్బ్ చేయడం ఎందుకని నేను బయటికి వచ్చాను" సంజాయిషీ చెబుతున్నట్లుగా అన్నారు.

"ఆఫీసు పనేంకాదు లెండి! మా తమ్ముడికి ఉత్తరం రాస్తున్నాను. ఈ రెసిషన్లో వాడి ఉద్యోగం పోయింది. రెసిషన్ పేరు చెప్పి కంపెనీల వాళ్లు స్టాఫ్‌ని దారుణంగా తగ్గించేస్తున్నారు. ఉద్యోగం పోయిందని మావాడు తెగ వర్రీ అయిపోతున్నాడు. వాడికి కాస్త ధైర్యం చెబుతూ ఉత్తరం రాసాను" కొంచెం బాధతో అన్నాను.

"అవునూ... చెప్పులు బాగుచేసేవాళ్లు ఇక్కడ దగ్గిర్లో ఉన్నారా?" ఆయనతో అడుగులువేస్తూ ప్రశ్నించాను.

ఇక్కడే 'ఖైరతాబాద్ దగ్గిర ఉన్నాడు' అన్నారాయన.

'పదండి... నేనూ వస్తాను. మీ పనయింత రువాత టిఫిన్ చేద్దాం' అన్నాను. 'సరే... నీ ఇష్టం!' నవ్వుతూ మాటల్లోకి దిగారు ఆంజనేయులుగారు.

"ఉద్యోగం అంటే చెబుతాను... మనం వాటిని సంపాదించుకోలేకపోతే మనమే ఏదో సొంత వ్యాపకం, సంపాదించే మార్గం చూసుకోవాలి. సంపాదించే తపన ఉండాలి గానీ ఏదో విధంగా నిజాయితీగా సంపాదించవచ్చు" చాలా క్యాజువల్‌గా అన్నారు ఆంజనేయులుగారు.

"అలా చెప్పటం తేలికండీ... ఏదో విధంగా ఎలా సంపాదించగలం?" కొంచెం గట్టిగానే అన్నాను.

"సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను... ఈ రోజు పొద్దున నేను వాకింగ్‌కి వెళుతూంటే ఒక సంఘటన చూసాను. మా ఇళ్లవైపే రెండు నర్సింగ్‌హోమ్‌లున్నాయి. ఒకబ్బాయి ఫ్లాస్క్ తీసుకుని లోపలికి వెళ్లి వచ్చాడు. రెండు ఖాళీ ఫ్లాస్కులతో బయటికివచ్చాడు. ఫ్లాస్క్‌లోని కాఫీ ఖాళీ అయిందని ఎలా తెలిసిందంటే నేను చివరగా ఒక కప్పు తాగాను కనుక. అతను అలా ఎన్ని ఫ్లాస్కుల కాఫీతెచ్చినా ఇట్టే అయిపోతుందట. ఎంతలేదన్నా ఆ రెండుఫ్లాస్కుల కాఫీకి అతను రెండొందలైనా సంపాదిస్తాడు. అతను కాఫీ, టీలు ఆ రెండు నర్సింగ్‌హోమ్‌లకే ఇస్తూంటే వచ్చే సంపాదన అది. అదే అయిదారు అంతస్థులు ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో ఇలాగే ఏ ఇడ్లీలో, దోసెలో సప్లయ్ చేస్తే అతని సంపాదన ఎంతుంటుందంటావు? ఊహించుకుంటేనే ఆనందంగా ఉంది" ఆంజనేయులుగారు చెప్పుకుపోతున్నారు. ఆయన మాటలు ఏదో పాయింట్ ఇస్తున్నట్లున్నాయి.

"కానీ అందరూ అలాంటి పనులు చేయగలరంటారా?" కొంచెం వ్యంగ్యంగానే అన్నాను.

"చెయ్యొచ్చు! ఇందులో తప్పేముంది? బ్రతుకు తెరువుకు అన్యాయంగా పొందనిది ఏదైనాసరే అది సంపాదనే అవుతుంది! కాదంటావా?..." నవ్వుతూ అన్నారు.

ఎందుకో ఆయన మాటలకి జవాబు ఇవ్వ బుద్ధికాలేదు. ఎందుకంటే ఆయన మాటలను అంగీకరించడానికి నామనసు అంగీకరించ లేదు.

ఇద్దరం ఖైరతాబాద్ జంక్షన్‌కి వచ్చాం. ఎడమ ప్రక్కనే ఉన్న చిన్న చెప్పుల షాప్‌కి చేరుకున్నాం.

"ఇవి కాస్త త్వరగా చేసియ్యి!" అంటూ కాళ్ల కున్న బూట్లని విప్పి ఇచ్చారు ఆ అబ్బాయికి.

అప్పటికే ఆ అబ్బాయి మరొకరి చెప్పులు రిపేర్ చేస్తున్నాడు.

ఓ ఐదునిమిషాలకి ఆ పనిపూర్తిచేసి, అతని దగ్గిర పాతిక రూపాయలు తీసుకున్నాడు.

ఇంతలో మరొకరువచ్చి "ఉన్నట్టుండి చెప్పు తెగిపోయింది కాస్త త్వరగా కుట్టిపెట్టుబాబూ. మెట్రో ట్రైన్ వచ్చే వేళయింది" అంటూ హడావుడి చేసాడు.

ఆంజనేయులుగారి పర్మిషన్‌తో ఆ చెప్పుని సరిచేసి ఐదు రూపాయలు తీసుకున్నాడు.

ఆంజనేయులుగారి బూట్లు సరిచేస్తున్నంత సేపూ అతనికి ఏదో ఒక గిరాకీ వస్తూనేఉంది.

నాకాశ్చర్యం కలిగింది. మేము ఉన్న ఒక్క అరగంటలో అతని సంపాదన డబ్బయ్ - ఎనభై రూపాయలయితే రోజుకెంత... నెలకెంత సంపాదిస్తాడో అనుకుంటూ లెక్కలు కడుతున్నాను నేను.

సరిచేసిన బూట్లని తొడుక్కుని, అడక్కుండానే అతని చేతికి ఇరవై రూపాయలు ఇచ్చి "చాలా లేటయింది మూర్తీ... సారీ" అన్నారు ఆంజనేయులుగారు.

"ఫర్వాలేదు సార్! టిఫిన్ చేసిపోదాం" అన్నాను.

"సరే పద!" అంటూ అడుగులు ముందుకు వేసారాయన.



నెల్లూరులో జరిగిన సోమిరెడ్డి జమున స్మారక అవార్డ్ సభలో డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి కథాసంకలనం 'నక్షత్రం' ని ఆవిష్కరించిన లయన్ ఎ. రాజేంద్రప్రసాద్. చిత్రంలో అవార్డ్ గ్రహీత 'మట్టిమల్లెలు' నానీల రచయిత్రి డా॥ అడవాల సుజాత, గ్రంథకర్త డా॥ పెళ్ళకూరు జయప్రద, శ్రీమతి దోర్నాదుల సుబ్బమ్మ, శ్రీమతి పాతూరి అన్నపూర్ణ తదితరులు.

"ఎంత ఆశ్చర్యం సార్! ఆ చెప్పుల కుర్రాడు చూసారా? మనం అక్కడున్న అరగంటలో ఎంత సంపాదించాడో" అన్నాను విస్మయంగా.

"అవును మరి... ఉద్యోగాలు లేవు... లేవంటూ ప్రభుత్వాన్ని దుయ్యబట్టటం కన్నా ఇలా ఏదో ఒక విధంగా సంపాదిస్తే మనం చేసే ఉద్యోగాలు ఏ పాటివి?" గంభీరంగా అన్నారు.

"మీరన్నది నిజమేకానీ ఇవి కులవృత్తులు. ఎవరికి పడితేవారికి ఆవిద్యలు రావు కదా?" ఏదో సత్యాన్ని కనుక్కుని చెబుతున్నట్లుగా అన్నాను.

"అదే మనం పొరబడుతున్నాం. ఫలానా వాళ్లు ఫలానా ఉద్యోగమే చేయాలని ఎక్కడా లేదు. నిజాయితీగా డబ్బు సంపాదించటానికి ఎవరు ఏ వృత్తిని ఎన్నుకున్నా అది ఆ యోగ్యమైనది కాదంటావా?" అంటూ ప్రశ్నించారు నెమ్మదిగా నడుస్తూ.

"యోగ్యమైనదే కానీ ఎంతవరకూ ఆచరణీయం?" కొద్దిగా ఆవేశంగానే అన్నాను.

నెమ్మదిగా నడుస్తున్న ఆంజనేయులుగారు ఒక్కసారిగా ఆగిపోయారు. నేనూ నుంచున్నాను. "యోగ్యమైనదే కానీ ఆచరణకి వచ్చేసరికి కష్టం అంటావు... అదేనోయ్ మనదేశ దౌర్భాగ్యం. ఫాల్స్‌ప్రిస్టేజితో దేశంలోని యువత ముందుకు పోవటం లేదు. అతను చూడు... ఎటువంటి భేషజాలకూ పోకుండా తన వృత్తికాకపోయినా అతనికి ధైర్యం ప్రసాదించిన కళని ఆసరాగా తీసుకుని ఈ ఉద్యోగాల వేటలో చిక్కుకోక ఎలా సంపాదిస్తున్నాడో... జీవితం నుంచి జనించిన కళని జీవించటానికి వీలుగా మలచినప్పుడే జీవితం సార్థకం అవుతుంది. విద్య అంటే డిగ్రీలే కాదు. 'ప్రాజ్ఞత వేరు – పట్టా వేరు' అనేది మనం మరిచిపోకూడదు. బ్రతకటానికి ఉపయోగపడే ఏకళైనా విద్యే!" ఆవేశంగా చెప్పుకుపోతున్నారు.

"అంటే అతని కులం... అతను చేసే వృత్తి వేరంటారా?" ఆసక్తిగా ప్రశ్నించాను.

"అవును... వేరే..." నవ్వుతూ అన్నారు ఆంజనేయులుగారు.

"మీరెప్పుడైనా అతన్ని ఈ విషయం అడిగారా సార్! అంత ఘంటాపథంగా చెప్తున్నారు?" కాస్త వ్యంగ్యంగానే అడిగాను.

"చెబితే ఆశ్చర్యపోతావు... అతను ఎవరోకాదు మా అబ్బాయే. డిగ్రీ చదివి, ఇదిగో... ఇలా..." నడుస్తున్న వాడిని కాస్తా నడిరోడ్డుమీద ఒక్కసారిగా దిగ్భ్రాంతితో స్థాణువులా అలాగే నిలబడిపోయాను.

చదువుకొనే రోజుల్లో స్నేహితుడి షాపులో సరదాగా ఈ పని నేర్చుకున్నాడు. ఖాళీగా ఉన్నపుడు అక్కడ పనిచేసి, తన పోకెట్‌మనీ తనే సంపాదించుకొనేవాడు. ఇదిగో ఈ వాచీ కూడా అప్పుడు వాడు తన సంపాదనతో కొని ఇచ్చిందే... చేతివంక మురిపెంగా చూసుకొంటూ చెప్పుకుపోతున్నారాయన.

డిగ్రీ పూర్తయిన తరువాత ఇలా షాపు పెట్టుకొంటాననంటే మొదట్లో నేనూ ఒప్పుకోలేదు. కానీ తన పట్టుదలతో సాధించాడు. కేవలం 5 వేల పెట్టుబడితో ప్రారంభించిన ఆషాపు విలువ నేడు లక్షరూపాయలు పైమాటే. చెబుతున్న ఆయన మొహంలో ఎటువంటి బాధ, ఆందోళనా లేవు. ఆ కళ్లల్లోని మెరుపు దేశానికి ఏదో సందేశాన్ని ఇస్తున్నట్లనిపించింది.

మా తమ్ముడికి రాసిన ఉత్తరం జేబులోనే ఉంది. 'ఉత్తరం మార్చి రాయాలి' అనుకుంటూ దానిని చింపి, రోడ్డుప్రక్కకి విసిరేసాను. ●